Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్ : 9440815774

ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక : 213 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | శుక్రవారం 14 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 2

## స్వయం సహాయక సంఘాలకు
# గుడ్ న్యూస్



- 10 మంది నిబంధన సడలింపు
- 8 మంది సభ్యులున్నా రిపీట్ డోస్ లబ్ధి
- బ్యాంక్‌కు మంత్రి కొండపల్లి అభినందనలు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

స్వయం సహాయక సంఘాల మహిళలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సభ్యుల మరణం లేదా వలసల వల్ల ఒక సంఘంలో సభ్యుల సంఖ్య 10 కంటే తగ్గితే, ఆ సంఘాలు ఎంత బాగా పనిచేసినా తదుపరి రుణ సదుపాయం (రిపీట్ డోస్) పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని... ఈ క్రమంలోనే ఏపీ గ్రామీణ బ్యాంక్ తమ అంతర్గత ఉత్తర్వులు నెంబర్ 152 ద్వారా ప్రత్యేక సడలింపులు ప్రకటించడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. అలాగే - మిగతా3లో



## ఆర్ఎస్ఎస్, బీజేపీలు ఒక జోకర్ల గుంపు

- అప్పటి వరకు వారిని నిద్రపోనివ్వం: రాహుల్ ఘాటు విమర్శలు
- అధికార పార్టీకి భిన్నంగా ఉండటమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమన్న కాంగ్రెస్ అగ్రనేత
- ఆర్ఎస్ఎస్ నాయకులకు ప్రస్తుత భారతదేశంపై ఎలాంటి అవగాహన లేదని రాహుల్ వ్యాఖ్య
- ఆర్ఎస్ఎస్ బడా పెట్టుబడిదారుల చేతుల్లో సాధనంగా మారిపోయిందని విమర్శ

## అమరావతి నిర్మాణంలో
# మొదటి మెట్టు

- స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్
- రాయపూడిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయం పరిశీలన



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభంతో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాభివద్ధిలో, అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు అని సీఎం స్పష్టం చేశారు. ఉండవల్లి వద్ద రాజధాని అమరావతిని విజయవాడ -- మంగళగిరి -- గుంటూరులతో కలిపే కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ--3ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రహదారిని అనుసంధానించేలా బకింగ్ హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను కూడా సీఎం ప్రారంభించారు. వీటి ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్‌లతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాయపూడి నుంచి వెంకటపాలెం-- పెనుమాక మీదుగా ఉండవల్లి వరకూ సీడ్ యాక్సెస్ రహదారిని సీఆర్డీఏ నిర్మించింది. స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించటంతో రాజధాని నగరానికి మెరుగైన కనెక్టివిటీ వచ్చినట్టైంది. మూడో దశలో మణిపాల్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా ప్రణాళిక చేశారు. దీనికి రూ.1,519 కోట్ల వ్యయం కానుంది. స్టీల్ బ్రిడ్జిలతో పాటు సీడ్ యాక్సెస్ రహదారిని సీఎం కాలినడకన తిరిగి ఆసాంతం పరిశీలించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ... 'రాష్ట్రాభివద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్. రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులందరికీ - మిగతా3లో

## ప్రతి కేసుకు ఒకే టైమ్‌పీరియడ్ సాధ్యం కాదు



- ప్రత్యేక కోర్టులతోనే అన్నీ పరిష్కారం!: జస్టిస్ సూర్యకాంత్
- ప్రతి కేసుకు ఒకే కాలపరిమితి సాధ్యం కాదన్న సీజేఐ
- ప్రత్యేక కోర్టులు, టైమ్ బౌండ్ ట్రయల్స్‌తో పెండింగ్ కేసుల పరిష్కారం జరుగుతుందున్న జస్టిస్ సూర్యకాంత్



## పార్లమెంట్‌లో పోటాపోటీ నిరసనలు

- నినాదాల మధ్య ఉభయసభలు నిరవధిక వాయిదా
- చివరి రోజూ కొనసాగిన అధికార, విపక్షాల నిరసనలు
- లోక్‌సభలో వందేమాతరం గీతం అనంతరం సైన్ డై ప్రకటించిన స్పీకర్
- రాహుల్‌ను బీజేపీ టార్గెట్- కోతి బొమ్మతో కాంగ్రెస్ నిరసన

## ఏనుగుల సంరక్షణకు
# అత్యధిక ప్రాధాన్యత



- కుంకీ ఏనుగుల రాకతో ఏపీలో అద్భుత ఫలితాలు
- రాష్ట్రంలో ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు
- అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం**

'ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతాల్లో మదపుటేనుగుల గుంపులతో తీవ్రమైన సమస్యలుండేవి. సుమారు 132 నుంచి 142 ఏనుగులు గుంపులుగా ఏజెన్సీ ప్రాంతంలో కల్లోలం సష్టించేవి. చిత్తూరు జిల్లా పలమనేరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల గుంపులు పంటపొలాల మీద పడి పంటలను ధ్వంసం చేయడం, అడ్డొచ్చే వారిపై దాడులు చేయడంతో ప్రజల్లో భయందోళనలు నెలకొన్నాయి. నేను అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖల బాధ్యతలను - మిగతా3లో

# చంద్రబాబు
# అరాచక పాలన

- ఇదేమి రాజ్యం.. బాధితులే నిందితులు
- శాశ్వతంగా మీరు అధికారంలో ఉండరు మాల్యం చెల్లించుకుంటారు
- జైలు లోపల నన్ను అవమానించారు
- వెన్నుపోటు పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారు
- ఎమ్మెల్యే విరూపాక్ష అరెస్ట్ అధికార దుర్వినియోగానికి నిదర్శనం
- కర్నూలు జైల్‌లో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షితో వైయస్ జగన్ ములాఖత్



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, కర్నూలు**

రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసు వ్యవస్థ సర్వనాశనం చేసిన ఘనత చంద్రబాబు నాయుడుది అని నిత్యం వైసిపి కార్యకర్తలపై దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారనిరాష్ట్రంలో చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. బాధితులనే నిందితులుగా మార్చడం, దాడికి గురైన వారిపైనే కేసులు పెట్టడం, బాధితులకు అండగా నిలిచిన వారిని అరెస్ట్ చేయడం రాష్ట్రంలో పరిపాటిగా మారిందన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యే ఇంటిపై అర్ధరాత్రి వందలాది మంది పోలీసులతో దాడి చేసి, తలుపులు పగులగొట్టి అరెస్ట్ చేయడం ఇందుకు పరాకాష్ట అని పేర్కొన్నారు. కర్నూలు జైల్‌లో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షితో ములాఖత్ అనంతరం వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. - మిగతా3లో



## చైనా ముప్పు'ను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో
# అభివృద్ధి మంత్రం

- సరిహద్దు గ్రామాల్ని దేశపు తొలి గ్రామాలుగా అభివృద్ధి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- జెమితాంగ్‌లో రోడ్లు, విద్యుత్, వైద్యం, పర్యటకంతో మారుతున్న పరిస్థితులు
- మౌలిక వసతులున్నా ఉపాధి లేక ఖాళీ!

## తుది దశకు అయోధ్య రామమందిర సీఈఓ ఎంపిక ప్రక్రియ!



- సీఈఓ పోస్టు కోసం 5,585 దరఖాస్తులు
- సీఈఓ ఎంపిక కోసం సెర్చ్ కమిటీ ఇంటర్వ్యూలు
- ఈ ట్రస్ట్ సీఈఓను మూడేళ్ల కాంట్రాక్ట్‌పై నియమిస్తారు
- పనితీరు ఆధారంగా ఈ పదవీ కాలాన్ని పునరుద్ధరించే అవకాశం

# మాట తప్పని వ్యక్తి సీఎం చంద్రబాబు నాయుడు:

## మండల టీడీపీ అధ్యక్షుడు ఉదయ్ కుమార్



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 13:**
చిత్తూరు జిల్లా శాంతిపురం మండలంలోని సి.బందపల్లి, 64 పెద్దూరు, రాళ్లబూదుగూరు పంచాయతీల్లో గురువారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్. ఉదయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాకుండా ప్రజలకు మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే నాయకుడిగా చంద్రబాబు నాయుడుకు ప్రజల్లో విశ్వాసం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం విద్య, వైద్యం, రైతు సంక్షేమం, మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలను చేపడుతోందని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఇంటింటి ప్రచారం ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం చేపట్టనున్న కార్యక్రమాలను కూడా ప్రజలకు చేరువ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్ ఎస్.బసవరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి పి.వి. నాగరాజు, యూనిట్ ఇన్‌చార్జి ఆర్.ఎస్. మణి, టీడీపీ నేతలు బి.ఎం. కుమార్, గోవిందరాజులు, జెనీ, జయరాజు, మురళి, మహిళా నాయకురాళ్లు శకుంతల, మంజు, భార్గవి, రూప, హేమావతి, దేవి తదితరులతో పాటు టీడీపీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శేషము నాయుడు కండ్రిగ ఎస్టీ కాలనీలో

## టీడీపీ ఇంటింటి ప్రచారం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 13:**
శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలంలోని శేషము నాయుడు కండ్రిగ గ్రామంలోని ఎస్టీ కాలనీలో టీడీపీ నాయకుడు రావిళ్ల మునిరాజ నాయుడు ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కాలనీలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలతో ఆత్మీయంగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఇంటింటి ప్రచారానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డి. రామ నాయుడు, గాలిమురళి నాయుడు, పన్నీరుకాలువ వెంకటాచలం, మునిరత్నం, వాసు నాయుడు, డీసీసీ బ్యాంక్ చైర్మన్ బీమాల బాస్కర్, మాజీ సర్పంచ్ మాధవి,ఢిల్లీ బాబు,గున్నయ్య, సింగమల బాస్కరయ్య, యూనిట్ ఇన్‌చార్జిలు లెక్కల మురళి నాయుడు, జి.శంకర్ నాయుడు, చిత్తూరు బాలాజీ, బూత్ ఇన్‌చార్జిలు సుశేఖర్ నాయుడు, సి.శంకర్ నాయుడు, చెంచయ్య, రాజా, ప్రభాకర్, సుబ్రహ్మణ్యం,తాతయ్య, రాజేంద్ర, రామ్మూర్తి, నెలబల్లి సునీల్, వి. ప్రసాద్ నాయుడు, రాంచంద్రం నాయుడు,సుబ్రహ్మణ్యం ఆచారి తదితరులు పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు,టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ జాతరకు పటిష్ట భద్రత

## ప్రశాంత నిర్వహణే లక్ష్యం : డీఎస్పీ శ్రీనివాసరావు



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు13:**
రేణిగుంటలో ఈ నెల 17,18,19 తేదీల్లో నిర్వహించనున్న గంగమ్మ జాతరను ప్రశాంతంగా, వైభవంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. జాతర ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో ఎమ్మార్వో, ఎంపీడీవో, డీఎస్పీ ఆధ్వర్యం లో ఆటో,కారు యూనియన్ ప్రతినిధులు, ఆలయ అధికారులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందు లు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రహదారుల పై వాహనాలను ఇష్టానుసారంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని వాహనదారులను,దుకాణాలను క్రమబద్ధంగా ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులను కోరారు. జాతర విజయ వంతానికి ప్రజలు,భక్తులు, వ్యాపారులు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# గో సంరక్షణకు రూ.లక్ష విరాళం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు13:**



శ్రీకాళహస్తి గో సంరక్షణ కార్యక్రమానికి విశాఖపట్నం మధురా నగర్‌కు చెందిన బోనం సోమ నాయుడు, విజయలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులకు దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. దేవస్థానం తరపున తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సహాయ కార్యనిర్వహణ అధికారి లోకేష్ బాబు, ఏపీఆర్వోలు బి. రవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ 2026లో నోటీసుల విచారణకు ప్రత్యేక కౌంటర్లు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు13:**
శ్రీకాళహస్తి భారత ఎన్నికల సంఘం, తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం కొనసాగుతోంది.ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం నో మ్యాపింగ్‌కు సంబంధించి 5,467 మందికి, అనామలీస్‌కు సంబంధించి 12,126 మందికి నోటీసులు జారీ చేసి, సంబంధిత ఓటర్లకు అందజేశారు. ఈ నోటీసుల పై విచారణ ప్రక్రియ ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 17 వరకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నారు. విచారణ కోసం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంటాయి. ఆగస్టు 14న విచారణకు హాజరైన నోటీసులు అందుకున్న ఓటర్లు శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి ప్రత్యేక కౌంటర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విచారణ ప్రక్రియను పర్యవేక్షించారు.నోటీసులు అందుకున్న సంబంధిత ఓటర్లు తమకు కేటాయించిన తేదీ, సమయంలో పురపాలక సంఘ కార్యాలయానికి హాజరై, ఓటరు మరియు వారి తల్లిదండ్రులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను బీఎల్ఓలకు సమర్పించాలని అధికారులు సూచించారు. ఓటర్ల జాబితాను సక్రమంగా రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# శ్రీకాళహస్తిలో ఘనంగా

## 90వ వారం డొక్కా సీతమ్మ అన్నదానం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు13:**
శ్రీకాళహస్తి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనలో భాగంగా శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం 90వ వారానికి చేరుకోవడం విశేషం. పవన్ కళ్యాణ్ ఆశయాల కోసం నిరంతరం కృషి చేస్తున్న జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, పేదలు, నిరుపేదలు మరియు అవసరార్థులకు ఆహారం అందించడం ద్వారా డొక్కా సీతమ్మ సేవా స్ఫూర్తిని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, గంధం శ్రీను, తేజ, మహేష్, మనీ, ప్రదీప్ కుమార్, లక్ష్మణ్, దినేష్, నవీన్, చల్ల హరి, చల్ల నవీన్, చందు, జానీ, సాయి, రాజా తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో

## జాతీయ జెండా భారీ ర్యాలీ

**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు13:**



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం హిందూపురంలో జాతీయ జెండా భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా.ఫైరోజాబేగం ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.మంజువాణి, డీపీఎంవో డా.జయం పద్మజ ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబట్టి దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. 'దేశసేవే ప్రజాసేవ', 'ఆరోగ్య భారతమే అభివృద్ధి భారత్', 'కరుణ మన బలం–సేవ మన ధర్మం' అంటూ నినాదాలతో ప్రజల్లో దేశభక్తి, ఆరోగ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా.పద్మజ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం కేవలం వేడుక మాత్రమే కాదని, దేశం, సమాజం పట్ల మన బాధ్యతలను గుర్తుచేసుకునే సందర్భమని అన్నారు. ఆరోగ్య వంతమైన ప్రజలే బలమైన దేశానికి పునాది అని పేర్కొన్నారు. అనంతరం దేశ సమగ్రత, ఆరోగ్య పరిరక్షణ, బాధ్యతా యుత పౌరసత్వంపై ఆరోగ్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డా.జయంత్, డా.వహీద్, డా.ఉషారాణి, డా.శాంతా, డా.హిమబిందు, ఆరోగ్య సిబ్బంది మల్లప్ప, ముస్తఫా, వాసు, మధ్యస్థ, రమేష్, నరసింహులు, నాగరాజు, సాయి, సురేష్‌శేఖర్, భాస్కర్, జగదీశ్ పాల్గొన్నారు.

# రేపు ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి

## వసుంధరాదేవి హిందూపురం పర్యటన

**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,ఆగస్టు13:**



స్థానిక ఎమ్మెల్యే పద్మ భూషణ్ నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి శనివారం హిందూపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. పర్యటనలో భాగంగా ఉదయం 7 గంటలకు హిందూపురం పట్టణంలోని బాలాజీ సర్కిల్‌లో నిర్వహించే 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. ఉదయం 8.30 గంటలకు డీబీ కాలనీలో నూతనంగా నిర్మించిన పార్కును ప్రారంభిస్తారు. 10 గంటలకు ఎమ్మెల్యే నివాసం వద్ద ఎనిమిది మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలను పంపిణీ చేస్తారు. ఉదయం10.45 గంటలకు లేపాక్షి మండలం పులమతిలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు చిలమత్తూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రూ.2 కోట్లతో నిర్మించిన బాలికల హాస్టల్‌ను ప్రారంభించనున్నారు.

# ప్రత్యేక ఓటర్ల సవరణపై బీఎల్ఓలతో సమీక్ష






**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్13:**
చిత్తూరు జిల్లా శాంతిపురం మండల సచివాలయంలో గురువారం ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమంపై బీఎల్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ లేని, పేర్లు సరిపోలని 333 మంది, వయస్సు, తల్లిదండ్రుల పేర్లలో తప్పులు ఉన్న 5,522 మంది కలిపి మొత్తం 5,855 మంది ఓటర్లను ప్రాథమికంగా అనర్హులుగా గుర్తించి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారు ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల ఆధారాల్లో అవసరమైన ఆధారాలను సంబంధిత బీఎల్ఓలకు సమర్పించాలని సూచించారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తహశీల్దార్, ఎంపీడీఓలకు నివేదిక అందజేస్తారని, అనంతరం అర్హతను నిర్ణయిస్తారని తెలిపారు. ఓటరు మ్యాపింగ్, పేర్లు, వయస్సు, తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన సమాచారం గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల సచివాలయంలో అందుబాటులో ఉందన్నారు. సంబంధిత ఓటర్లు వెంటనే ఆధారాలతో బీఎల్ఓలను సంప్రదించాలని అధికారులు కోరారు.

# మహాలక్ష్మి దీప పూజ ఏర్పాట్లను

## పరిశీలించిన ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి



**పలమనేరు,చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు13:**
శుక్రవారం పలమనేరులో జరగనున్న మహాలక్ష్మి దీప పూజ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. కార్యక్రమం నిర్వహించనున్న ప్రాంగణా న్ని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి గురువారం సాయంత్రం పరిశీలించారు. ఏర్పాట్లను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మహాలక్ష్మి దీప పూజకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ముఖ్యంగా భక్తుల రాకపోకలు, తాగునీరు, పారిశుధ్యం, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎటువంటి అవాంఛనీ య సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని టీటీడీ అధికారులను ఎమ్మెల్యే అమర్నా థరెడ్డి ఆదేశించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో పూజా కార్యక్రమంలో పాల్గొనేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అమర్నాథరెడ్డితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, టీటీడీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గౌతు లచ్చన్న జయంతి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు13:**
స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, గీత కార్మికుల నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని జిల్లా ఈడిగ గౌడ్ సంఘం నాయకులు పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డిని ఆహ్వానించారు. గురువారం పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన సంఘం నాయకులు జయంతి ఉత్సవాల వివరాలను తెలియజేసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ నెల 16న చిత్తూరు జిల్లా కేంద్రంలోని కట్టమంచి నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించనున్న శాంతి ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొనాలని వారు కోరారు. సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బడుగు, బలహీన వర్గాలు, గీత కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకునేందుకు జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈడిగ గౌడ్ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి గౌడ్, ఉపాధ్యక్షుడు జనార్దన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గోపి గౌడ్, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ ఈడిగ బీసీ సాధికారక సమితి నాయకులు బుసా నాగరాజు గౌడ్, మాజీ కౌన్సిలర్ మదన్ మోహన్ గౌడ్, పవన్ గౌడ్, కిషోర్, వంశీ, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి హెల్మెట్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

**ఎస్ఆర్‌పురం,చిత్తూరు ఎక్స్‌ప్రెస్,ఆగస్టు13:**




రోడ్డు ప్రమాదాల నివారణ, ద్విచక్ర వాహనదారుల భద్రతే లక్ష్యంగా శుక్రవారం నిర్వహించ నున్న 1,000 హెల్మెట్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పారిశ్రామికవేత్త, సమాజ సేవకుడు మాది రాజు గణేష్‌రాజు కోరారు. కార్వేటి నగరం మండలం అన్నూరు పంచాయతీ పరిధిలోని అమ్మపల్లి క్రాస్ వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని ఎస్ఆర్‌పురం, పాలసముద్రం, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లోని యువకులు, రైతులు, అధికారులు తదితరులకు హెల్మెట్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం. థామస్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు గణేష్‌రాజు తెలిపారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్న ఘటనలు, పలువురు క్షతగాత్రు లుగా మిగులుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సేవా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వివరించారు. పోలీసు అధికారులు, యువత, రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు, మాజీ సర్పంచ్ ఆదం సుందర్‌రాజన్ పాల్గొన్నారు.

# మహాకుంభమేళ తరహాలో గోదావరి పుష్కరాలు



**రాజమండ్రి :** ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా తరహాలో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అత్యున్నత వసతులతో 2027 గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. దక్షిణాది మహా కుంభమేళాగా భావించే ఈ పుష్కరాలకు కోట్ల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గ్లోబల్ స్టాండర్డ్స్‌కు తగినట్లు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మహాక్రతువు కోసం మొత్తం అంచనా వ్యయం రూ.8,500 కోట్లుగా నిర్ధారించగా.. తొలి విడత మౌలిక వసతులు, ఘాట్ల విస్తరణ పనుల నిమిత్తం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.530 కోట్లను అధికారికంగా మంజూరు చేసింది.పుష్కరాల నిర్వహణలో అత్యంత కీలకమైన శాఖలకు నిధుల కేటాయింపులను ప్రభుత్వం పక్కాగా వర్గీకరించింది. గోదావరి తీరంలో భక్తుల రద్దీని తట్టుకునేలా 238 పాత , కొత్త పుష్కర ఘాట్ల ఆధునీకరణ, మరమ్మతులు, నిర్మాణాలు చేపడుతున్న నీటిపారుదల శాఖకు అత్యధికంగా రూ.210.06 కోట్లు కేటాయించారు. పట్టణ మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ పనుల నిమిత్తం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.150 కోట్లు విడుదల కాగా, గోదావరి తీరమంతటా నిరంతర విద్యుత్ సరఫరా, తాత్కాలిక సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఇంధన శాఖకు రూ.100 కోట్లు కేటాయించారు. దీంతో పాటు ఆలయాల సుందరీకరణ, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు దేవాదాయ శాఖకు రూ.60 కోట్లు, టూరిజం సేవలు, సాంస్కృతిక ప్రదర్శనల విస్తరణకు పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.10 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఈసారి పుష్కరాలలో డిజిటల్ టెక్నాలజీ వినియోగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. లక్షలాది మంది భక్తులు ఒకేసారి వచ్చే అవకాశం ఉన్నందున క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ సర్వైలెన్స్, రియల్ టైమ్ కంట్రోల్ రూమ్‌లను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. భక్తులు తాము స్నానం చేయాలనుకునే ఘాట్లు, స్లాట్ బుకింగ్, ట్రాఫిక్ రూట్ మ్యాప్స్, అందుబాటులో ఉన్న పార్కింగ్ స్థలాలు, అత్యవసర వైద్య సేవల సమాచారాన్ని సులువుగా తెలుసుకునేలా ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను, క్యూఆర్ కోడ్ నేవిగేషన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.నది తీరం పొడవునా పారిశుధ్యం, భద్రత , పర్యావరణ పరిరక్షణ విషయాలలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. నది నీరు కలుషితం కాకుండా ప్రత్యేక ఫిల్ట్రేషన్ గ్రిడ్లను ఏర్పాటు చేయడమే కాక, ప్లాస్టిక్ రహిత పుష్కరాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఘాట్ వద్ద 24 గంటలు అందుబాటులో ఉండేలా మొబైల్ మెడికల్ టీమ్‌లు, అంబులెన్సులు, పారిశుధ్య సిబ్బంది , స్విమ్మింగ్ నిపుణులను అందుబాటులో ఉంచనున్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు వేగంగా పనిచేస్తాయి. రాజమండ్రి, కోవూరు, నరసాపురం, భద్రాచలం పరిసర ప్రాంతాల గోదావరి తీరాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్ది, పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తులకు భక్తిపారవశ్యంతో పాటు అధునాతనమైన, సురక్షితమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందించడమే లక్ష్యంగా వైభవంగా ఏర్పాట్లు వేగవంతమవుతున్నాయి.

# విజయసాయపార్టీ లీకుల వ్యూహం ఏమిటీ



**నెల్లూరు :** వైఎస్సార్‌సీపీలో ఒకప్పుడు నంబర్-2గా చక్రం తిప్పి, ఆ తర్వాత రాజకీయ సన్యాసం ప్రకటించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన అనంతరం తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటాను అని చెప్పిన ఆయన, ఇప్పుడు సడన్‌గా కొత్త పొలిటికల్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తొలినాళ్లలో విజయసాయిరెడ్డి బీజేపీ గూటికి చేరుతారని విస్తృత ప్రచారం జరిగింది. ఢిల్లీ స్థాయిలో ఆయనకున్న పరిచయాలు, కేంద్ర పెద్దలతో ఉన్న సంబంధాల దృష్ట్యా కమలం తీర్థం పుచ్చుకుంటారని భావించారు. అయితే, ఏపీలో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అధికారంలో ఉంది. విజయసాయిరెడ్డిని పార్టీలోకి తీసుకుంటే టీడీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందనే భావనతో పాటు, కూటమి ధర్మాన్ని పాటించేందుకు కేంద్ర బీజేపీ నాయకత్వం ఆయన చేరికపై సుముఖత చూపలేదని సమాచారం. బీజేపీ తలకదనం లేకపోవడంతో, అలాగే ఇతర జాతీయ పార్టీల వైపు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆయనకు సొంత బాట పట్టడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది.కొన్ని రోజులుగా ఆయన తిరిగి పాతగూటికి వెళ్తారని ప్రచారం జరుగుతున్నా అది దాదాపు అసాధ్యమని అంటున్నారు. వైఎస్సార్‌సీపీలో అంతర్గతంగా పెరిగిన విభేదాలు, కోటరీతో విభేదించి బయటకు రావడం, ఆ తర్వాత ఆ పార్టీ అధినాయకత్వాన్ని ఉద్దేశించి సోషల్ మీడియా ద్వారా విమర్శనాత్మక పోస్టులు పెట్టడం వల్ల జగన్‌తో ఆయనకు గ్యాప్ పెరిగింది. ఎన్నికల ఓటమి తర్వాత జగన్ కూడా విజయసాయిరెడ్డి వ్యాఖ్యల పట్ల అసంతృప్తిగా ఉన్నారని, ఆయనను తిరిగి చేర్చుకోవడానికి జగన్ సిద్ధంగా లేరనే అభిప్రాయం వినిపించడంతో విజయసాయిరెడ్డి పూర్తిగా వైఎస్సార్‌సీపీ అధ్యాయానికి స్వస్తి చెప్పారని భావించవచ్చుఈ పరిణామాలతో విజయసాయిరెడ్డి భారత్ జన వికాస్ పేరుతో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేసుకుంటున్నట్లు లీకులు బయటకు వచ్చాయి. శ్రావణ మాసం ముగిసేలోపు పార్టీ ప్రకటన ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. మహిళలు, రైతులు, యువత, సమగ్ర రాష్ట్రాభివృద్ధే ఎజెండాగా ప్రాంతాల వారీగా సభలు నిర్వహించాలని ఆయన యోచిస్తున్నారు. అయితే ఈ పార్టీ వెనుక మరికొందరు ముఖ్యుల ఆశీస్సులు ఉన్నాయా? లేదా ఇతర రాజకీయ శక్తులు తెరవెనుక ఉండి నడిపిస్తున్నాయా? అనే సందేహాలు కూడా రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం ప్రస్తుతం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి , వైఎస్సార్‌సీపీల మధ్య ముఖాముఖి పోరుగా ఉంది. ఈ బైపోలార్ పొలిటికల్ వాతావరణంలో మూడో శక్తిగా నిలబడటం లేదా సొంత పార్టీతో ప్రభావం చూపడం అత్యంత సంక్లిష్టమైన అంశం. విజయ సాయిరెడ్డికి మాస్ క్యాడర్ ఆధారిత ప్రజాదరణ లేకపోవడం, కేవలం ఆర్గనైజర్ , స్ట్రాటజిస్ట్‌గా మాత్రమే గుర్తింపు ఉండటం ప్రధాన పరిమితి. ఒకవేళ పార్టీ పెట్టినా, ఆయన సాధించే ఓటింగ్ శాతం కూటమికి లాభం చేకూరుస్తుందా లేక వైఎస్సార్‌సీపీ ఓట్ బ్యాంక్‌కే గండికొడుతుందా అనేది వేచి చూడాలి. భారీ ఆర్థిక వనరులు, బలమైన క్యాడర్ లేనిదే కొత్త పార్టీ నిలదొక్కుకోవడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మిత్రపక్షాల మధ్య డిజిటల్ వార్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి తమ సోషల్ మీడియా శ్రేణులను అప్రమత్తం చేస్తూ ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. కొద్దిరోజులుగా సోషల్ మీడియా వేదికగా టీడీపీ, జనసేన సైనికుల మధ్య సాగుతున్న పరస్పర విమర్శలు, వ్యక్తిగత దూషణలు శృతిమించి కూటమి ఐక్యతకే సవాలుగా మారిన తరుణంలో నాయకత్వం ఈ దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. గొడ్డలి పార్టీ కుట్రపూరితంగా సృష్టించిన నకిలీ ఖాతాల వల్ల ఈ అంతర్గత కలహాలు నడుస్తున్నాయని, ఆ ట్రాప్‌లో పడ వద్దని కూటమి సోషల్ మీడియా కోఆర్డినేషన్ కమిటీ స్పష్టమైన ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని వారాలుగా సోషల్ మీడి యాను గమనిస్తే.. పశ్చిమ ఏపీలోని అధికార సమన్వయం నుంచి మొదలుకొని, సినిమాలు, ఐకాన్స్, రాజకీయ ప్రాధాన్యతల వరకు టీడీపీ-జనసేన క్యాడర్ మధ్య ఘాటైన సైబర్ యుద్ధమే సాగుతోంది. సినిమాల నుంచి సీనియర్ ఎన్టీఆర్ ఆహారపు అలవాట్ల వరకూ తీవ్రస్థాయిలో ఎదురుదాడి చేసుకోవడం నిత్యకృత్యమైంది. గ్రౌండ్ లెవల్‌లో నాయకుల మధ్య సఖ్యత ఉన్నప్పటికీ, సోషల్ మీడియా డిజిటల్ స్పేస్‌లో చోటుచేసుకుంటున్న ఈ తీవ్ర స్వభావపు విమర్శలు అసలైన కార్యకర్తల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రత్యర్థులకు బలమైన రాజకీయ ఆయుధాన్ని అందించాయి. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని విపక్ష వైసీపీ సైబర్ వింగ్ అత్యంత వ్యూహాత్మకంగా సూడో అకౌంట్స్ నడుపుతోందని కూటమి సంయుక్త ప్రకటన ఎండగట్టింది. ఒక టీడీపీ అభిమానిలా ప్రొఫైల్ రూపొందించి పవన్ కల్యాణ్‌ను హేళన చేయడం, అలాగే జనసేన సైనికుడి ముసుగులో చంద్రబాబు లేదా లోకేష్‌లను వ్యక్తిగతంగా విమర్శించడం ద్వారా ఇరు వర్గాల అసలైన కార్యకర్తలను రెచ్చగొడుతున్న వైనాన్ని కమిటీ గుర్తించింది. ఈ డిజిటల్ ట్రాప్ వల్ల నిజమైన సైనికులు ఆవేశానికి లోనై ఒకరినొకరు కించపరుచుకుంటూ, చివరికి తమ సొంత ప్రభుత్వ విజయావకాశాలను, పథకాల ప్రచారాన్ని పక్కనబెట్టి అంతర్గత పోరులోనే శక్తిని వృథా చేసుకుంటున్నారు. రాజకీయాల్లో క్షేత్రస్థాయి ఐక్యత ఎంత ముఖ్యమో, డిజిటల్ మైండ్ స్పేస్‌లో పొత్తు ధర్మాన్ని నిలబెట్టుకోవడం కూడా అంతే కీలకం. శ్రేణుల మధ్య స్వల్ప విబేధాలు కాస్తా పార్టీల అగ్రనేతల మధ్య వైరి వర్గాలుగా రూపాంతరం చెందే ప్రమాదం ఉందని గ్రహించినందునే ఈ ఉమ్మడి ప్రకటన వెలువడింది. సంయమనం పాటించకపోతే, మిత్రపక్షాల నేతలను లక్ష్యంగా చేసుకుని విద్వేషం చిమ్మే ఏ అకౌంట్‌పైనా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేయడం మంచి పరిణామం అనుకోవచ్చు. ఆవేశాన్ని పక్కనబెట్టి, ప్రత్యర్థుల నకిలీ వ్యూహాలను తిప్పికొడుతూ ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపైనే కూటమి సోషల్ సైన్యాలు దృష్టి సారించాల్సి ఉంది.

## చంద్రబాబు అరాచక పాలన

-మొదటిపేజీ తరువాయి

ఆగస్టు 1న చిప్పగిరి మండలంలోని సంగాల గ్రామంలో వైయస్ఆర్‌సీపీ కార్యకర్త గిరిపై, ఆయన ఇంటిపై దాడి జరిగింది. సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎమ్మెల్యేకు గిరి రాత్రి 7.45 గంటలకు ఫోన్ చేసి, తనపై దాడి జరుగుతోందని, తన ఇంటి ఫొటోలు, వీడియోలు కూడా పంపించి రక్షించాలని కోరాడు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే 7.47 గంటలకు చిప్పగిరి ఎస్ఐకి ఫోన్ చేసి సంఘాల వెళ్లి గిరిని కాపాడాలని కోరారు. అనంతరం సీఐకి ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో ఉదయం 8.03 గంటలకు మరోసారి సీఐకి సమాచారం ఇచ్చారు. అయినా పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లలేదని తెలిపారు. పోలీసులు స్పందించకపోవడంతో గిరిని కాపాడేందుకు ఎమ్మెల్యే స్వయంగా సంఘాల గ్రామానికి వెళ్లారు. అక్కడ పరిస్థితిని చక్కదిద్ది, గిరిని తన కారులో ఎక్కించుకుని చిప్పగిరికి తీసుకువస్తుండగా నేమకల్లు వద్ద ఎమ్మెల్యేపైనే దాడి జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాములు గాయపడి చేయి విరిగిందని పేర్కొన్నారు. బాధిత కార్యకర్తను కాపాడేందుకు వెళ్లడాన్నే ఎమ్మెల్యేపై పెట్టిన మొదటి కేసుగా మార్చారని అన్నారు. నేమకల్లు ఘటనను కప్పిపుచ్చేందుకు టీడీపీ కార్యకర్త తన భార్య దుస్తులను తానే చింపి, ఎమ్మెల్యే మరియు ఆయన అనుచరులు చింపారంటూ ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టించారని వైయస్ఆర్‌సీపీ నాయకుడు ఆరోపించారు. ఇది ఎమ్మెల్యేపై పెట్టిన రెండో కేసు అని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కారును ధ్వంసం చేశారంటూ మూడో కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. దాడిలో గాయపడిన ఎమ్మెల్యే తమ్ముడు శ్రీరాములు, దాడికి గురైన గిరిని తీసుకుని ఎమ్మెల్యే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమపై జరిగిన దాడిపై ఫిర్యాదు చేయాలని కోరినా పోలీసులు కనీసం ఫిర్యాదును కూడా తీసుకోలేదని తెలిపారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి వెళ్లినా బాధితుల ఫిర్యాదు స్వీకరించకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇది నాలుగో తప్పిదమని పేర్కొన్నారు. ఫిర్యాదు తీసుకోకపోవడమే కాకుండా బాధితులైన విరూపాక్ష, ఆయన కుటుంబ సభ్యులు, వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలపైనే రివర్స్ కేసులు పెట్టారని తెలిపారు. సంఘాల ఘటనకు సంబంధించిన ఫిర్యాదులోనే పలువురి పేర్లు వేర్వేరు నిందితుల జాబితాల్లో మళ్లీ మళ్లీ పునరావృతం కావడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. విచారణ లేకుండానే కేసుల్లో పేర్లు చేర్చినట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇది ఐదో తప్పిదమని తెలిపారు. విరూపాక్షను పరామర్శించేందుకు తాను జైలుకు వెళ్లినప్పుడు తనను అవమానించేలా వ్యవహరించారని తెలిపారు. సాధారణంగా జైలుకు వచ్చే వారిని కూర్చోబెట్టి ఫొటోలు తీస్తారని, తనను మాత్రం గ్రిల్ బయట నిలబెట్టి ఫొటోలు తీశారని పేర్కొన్నారు. దీనిపై జైలు అధికారులను ప్రశ్నించగా, తనకు ప్రత్యేకంగా అలా చేయాలని ఆదేశాలు వచ్చాయని చెప్పారని తెలిపారు.

## అమరావతి నిర్మాణంలో మొదటి మెట్టు

-మొదటిపేజీ తరువాయి

పాదాభివందనం చేస్తున్నాను. రైతులది త్యాగం కాదు స్ఫూర్తి. సింగపూర్ అమరావతి బహత్ ప్రణాళికను ఉచితంగా ఇచ్చి సహకరించింది. గత పాలకులు ప్రజలతో పాటు సింగపూర్ ప్రతినిధులను కూడా వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ కాంప్లెక్సు భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయించాం. కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజం అవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తలలు దించుకోవాలి. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశాం. అసెంబ్లీలో రాజధాని 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి తర్వాత మూడు రాజధానులని మాట తిప్పేశాడు. 2019--24 మధ్య రైతుల ఉద్యమాన్ని చరిత్ర మర్చిపోదు. అమరావతితో పాటు రాష్ట్రం అంతటా అభివద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం. 'అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. '2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్ర చేయాలన్న సంకల్పం తీసుకున్నాం. ప్రజలు వ్యక్తులుగా మీరేం సంకల్పం తీసుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా, మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయండి. ప్రతీ ఇల్లు, వాణిజ్య సంస్థ పైనా జాతీయ జెండా ఎగరాలి. మండల, అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలి. ఓ ప్రజా ఉద్యమంగా తిరంగా ర్యాలీ జరగాలి. వచ్చే 21 ఏళ్లలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి. ఆ శక్తి సామర్థ్యలను ప్రజలే అందించాలి. అమరావతి రాజధాని అభివద్ధికి ప్రజలూ ఆలోచనలు పంచుకోవాలి. అమరావతి ఆర్థిక రాజధానిగా ఎదగాలి. 'అని సీఎం అన్నారు. అనంతరం మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రవణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణలతో కలిసి రాయపూడి వద్ద నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని సీఎం పరిశీలించారు.

## ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత

-మొదటిపేజీ తరువాయి

తీసుకున్న తర్వాత మొదటిగా ప్రజలకు, ఏనుగులతో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం మీదనే దష్టి సారించాన'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మదపుటేనుగులను నిరోధించేందుకు నాలుగు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వ సహాయంతో తీసుకొచ్చి, వాటికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మానవులు -- వన్య ప్రాణుల మధ్య ఘర్షణలను నివారించే ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వీటివల్ల ఏజెన్సీ ఏరియాల్లో మంచి ఫలితాలొస్తున్నాయని చెప్పారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా విశాఖపట్నంలో ప్రత్యేకంగా నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్ లో కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఏనుగులు పర్యావరణ సమతుల్యతకు వారధిగా నిలుస్తాయి. దేశ వన్యప్రాణి వారసత్వానికి అవి చిహ్నాలు. గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏనుగుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2014 నుంచి దేశంలోని ఏనుగుల సంరక్షణ కేంద్రాలు 26 నుంచి 33కు పెరిగాయి. కారిడార్ల రక్షణ, 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్' బలోపేతం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. కుంకీ ఏనుగులను రాష్ట్రానికి అందించడంలో సహకరించిన కర్ణాటక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ముఖ్యమంత్రి డీకే శివకుమార్, అప్పటి అటవీ, పర్యావరణ శాఖమంత్రి ఈశ్వర్ ఖండ్రేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మానవులు -- వన్య ప్రాణుల మధ్య నెలకొన్ని ఘర్షణలను పూర్తిగా నిరోధించేందుకు, వన్య ప్రాణులను రక్షణ కోసం రూపొందిన హనుమాన్ ప్రాజెక్టుతో మంచి ఫలితాలు వస్తున్నాయి. కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తివర్ధన్ సింగ్, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి తన్మయ్ కుమార్, అటవీ శాఖ డైరెక్టర్ జనరల్, ప్రత్యేక కార్యదర్శి సుశీల్ కుమార్ అవస్థి, రాష్ట్ర అటవీ మరియు పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ డాక్టర్ పి.వి. చలపతిరావు, ప్రాజెక్ట్ ఎలిఫెంట్ స్టీరింగ్ కమిటీ గౌరవ సభ్యులు, భారత ప్రభుత్వ, రాష్ట్ర అటవీ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాలకు గుడ్ న్యూస్

-మొదటిపేజీ తరువాయి



కొత్త మార్గదర్శకాల ప్రకారం కనీసం 8 మంది యాక్టివ్ సభ్యులు ఉన్న సంఘాలకు రిపీట్ డోస్ రుణం మంజూరు చేస్తారని... అయితే సభ్యుల సంఖ్య తగ్గడానికి వలసలు లేదా మరణం మాత్రమే కారణమై ఉండడంతో పాటు... అక్రమాలు లేకుండా.. పాత బకాయిలు లేకుండా సక్రమమైన చెల్లింపులు ఉండాలని కూడా మంత్రి సూచించారు. అర్హత గల సంఘాలు ప్రత్యేక తీర్మానం మరియు బాధ్యతా పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. రుణ సడలింపు పొందిన సంఘాలు 6 నెలల వ్యవధిలో తమ సభ్యుల సంఖ్యను మరల కనీసం 10 మందికి పెంచుకోవాలని కూడా మంత్రి తెలిపారు.

# సేవా సంకల్పంతో మాదిరాజు గణేష్ రాజు జీవన ప్రస్థానం



**కార్వేటినగరం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 13:**
చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన మాదిరాజు గణేష్ రాజు సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించి, స్వయం కృషితో వ్యాపార రంగంలో ఎదిగారు. ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాకుండా, సమాజానికి తన వంతు సేవ చేయాలనే సంకల్పంతో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

**వ్యవసాయ కుటుంబంలో జననం**

మాదిరాజు గణేష్ రాజు 1972 జూన్ 1న కృష్ణాపురం గ్రామంలో ఎం. నారాయణ రాజు, నరసమ్మ దంపతులకు జన్మించారు. ఆయన తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం**

గణేష్ రాజు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కృష్ణాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నారు. ఆరో, ఏడో తరగతులను కృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో, ఎనిమిది నుంచి పదో తరగతి వరకు కత్తిరిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేశారు.

**బెంగళూరులో జీవన ప్రయాణం**

1989లో బెంగళూరులోని కర్ణాటక స్టేట్ క్రికెట్ క్లబ్ అసోసియేషన్‌లో క్యాషియర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం 1995లో సొంతంగా హోటల్ నిర్వహిస్తూ వ్యాపార రంగంలో అడుగుపెట్టారు. ఐదేళ్లపాటు హోటల్ నిర్వహణ అనంతరం బిల్డింగ్ డెవలప్‌మెంట్ రంగంలోకి ప్రవేశించారు.

**కుటుంబ జీవితం**

1996లో తన బంధువైన అనిత రాజును వివాహం చేసుకున్నారు. వీరికి 1997లో ఎం.జి. కుమార్ రాజు జన్మించారు. ప్రస్తుతం కుమార్ రాజు కూడా బిల్డింగ్ డెవలప్‌మెంట్ రంగంలో కొనసాగుతున్నారు.

**నిర్మాణ రంగంలో అభివృద్ధి**

వశిష్ఠ హౌసింగ్ హోమ్స్, మణికంఠ హోమ్స్ పేర్లతో బిల్డింగ్ డెవలప్‌మెంట్ కార్యకలాపాలు నిర్వహిస్తూ గణేష్ రాజు ఆర్థికంగా అభివృద్ధి చెందారు. వ్యాపార రంగంలో ఎదుగుతూనే సామాజిక సేవకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

**కరోనా కాలంలో విస్తృత సేవలు**

ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి సమయంలో గణేష్ రాజు నిరుపేదలకు అండగా నిలిచారు. సుమారు రెండు టన్నుల బియ్యం, వెయ్యి కిలోల చికెన్‌తో పాటు నిత్యావసర సరుకులను పేదలకు పంపిణీ చేశారు. బెంగళూరు పరిధిలోని ఆనేకల్ తాలూకాలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చిన్న గ్రామస్థాయి నుంచి కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు.

**సొంత ప్రాంత ప్రజలకు అండగా...**

సొంత గ్రామంలోని పేదలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని అవసరమైన సందర్భాల్లో ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలుస్తున్నారు.



**రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి**

గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ పరిధిలో ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవడం, క్షతగాత్రులుగా మిగులుతున్న ఘటనలను గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న గణేష్ రాజు రహదారి భద్రతపై దృష్టి సారించారు. కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని ఎస్.ఆర్.పురం, పాలసముద్రం, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో యువకులు, రైతులు, అధికారులు, పోలీసులకు కలిపి లిలివెయ్యి హెల్మెట్లు ఉచితంగా అందించనున్నట్లులిలి తెలిపారు.ఆర్థికంగా ఎదిగిన తర్వాత కూడా తన మూలాలను మరచిపోకుండా ప్రజా సేవకు ప్రాధాన్యం ఇస్తున్న గణేష్ రాజు జీవన ప్రస్థానం సేవా దృక్పథానికి ప్రతీకగా నిలుస్తోంది.

## ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ అభివృద్ధిని వివరించిన టీడీపీ నాయకులు

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 13:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కార్యక్రమంలో భాగంగా కుప్పం మున్సి పాలిటీ 11వ క్లస్టర్ పరిధిలోని కొత్తపేట యూనిట్,180 వ బూత్ లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గత పాలనతో పోలిస్తే ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నామని నాయకులు తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగేందుకు తెలుగుదేశం పార్టీకి ప్రజలు అండగా నిలవాలని నాయకులు కోరారు. గతంలో వైసీపీ ప్రకటించిన 'వై నాట్ 175' నినాదాన్ని ప్రస్తావిస్తూ.. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పుతో ఆ నినాదానికి సమాధానం చెప్పాలని అన్నారు. 2029 ఎన్నికల్లో టీడీపీకి మరింత భారీ మెజార్టీ అందించడంతో పాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించి తమ రాజకీయ బలాన్ని చాటాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసు కోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడమే ఇంటింటి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు. కార్యక్ర మంలో ఎక్స్ ఎంపీటీసీ కృష్ణన్ రఘు దిలీప్ మైకేల్ ధర్మ రఫీ మరియు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుప్పంలో రూరల్ గ్రోత్ హబ్స్ పైలట్ ప్రాజెక్ట్‌పై సమీక్ష



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు13:**
కుప్పం నియోజకవర్గంలో నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న రూరల్ గ్రోత్ హబ్స్ (RGH) పైలట్ ప్రాజెక్ట్పై గురువారం పీడీ కాడా వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో నీతి ఆయోగ్ ప్రతినిధి సోమనాథ్ చౌదరి, అథేనా డైరెక్టర్ అంకిత్ ఛెత్రి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ రాజు, వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్, సెర్ప్, రెస్కో శాఖల అధికారులు పాల్గొన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఎనిమిది గ్రామాలను ఎంపిక చేసి ఏడు ప్రభుత్వ పథకాలను కన్వర్జెన్స్ ద్వారా రైతులకు అనుసంధానం చేయడంతో పాటు సుమారు 400 మంది రైతులతో ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్రోన్లు, సెన్సార్ టెక్నాలజీ, ఏఐ ఆధారిత వ్యవసాయ సలహాలు వంటి సాంకేతికతలను రైతులకు అందుబాటులోకి తీసుకురావడంపై చర్చించారు. కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వికాస్ మర్మత్ నీతి ఆయోగ్ ప్రతినిధులకు వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం, డ్రోన్ డెమో, పట్టు సాగు, ఆదిత్య బిర్లా సంస్థ ఆధ్వర్యంలోని స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను ప్రతినిధులు పరిశీలించారు. పైలట్ ప్రాజెక్ట్ విజయవంతానికి వివిధ శాఖలు, సంబంధిత సంస్థలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు.

## కుప్పం రెస్కో పాలకమండలి పదవీకాలం పొడిగింపు



**కుప్పం,చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు13:**
కుప్పం రెస్కో పాలకమండలి చైర్మన్, సభ్యుల పదవీ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రెస్కో చైర్మన్‌గా కొనసాగుతున్న ప్రతాప్‌కుమార్‌తో పాటు మొత్తం 15 మంది సభ్యుల పదవీకాలం పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుత పాలక మండలి యథావిధిగా తన విధులను కొనసాగించనుంది. పదవీకాలం పొడిగింపుతో కుప్పం రెస్కో పరిధిలో విద్యుత్ సరఫరా, వినియోగదారులకు అందించే సేవలు, ఇతర పరిపాలనా కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగనున్నాయి. పాలకమండలి సభ్యులు తమ బాధ్య తలను కొనసాగించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

## విద్యార్థులకు భద్రతపై పోలీసుల అవగాహన



**రామకుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు13:**
విద్యార్థులు అప్రమత్తంగా ఉండి సైబర్ నేరాలు, మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదే శాల మేరకు, కుప్పం డీఎస్పీ పార్థసారథి ఆధ్వర్యంలో గురువారం రామకుప్పం మండలం రాజుపేటలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో 'మీ భద్రత మా బాధ్యత', 'ధైర్య స్పర్శ' కార్యక్రమాలను నిర్వహించారు. కుప్పం రూంల్ సీఐ మల్లేష్ యాదవ్, రామకుప్పం ఎస్ఐ వెంకట మోహన్ విద్యార్థులకు చైల్డ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్పై విద్యార్థులకు అవగాహన కల్పించి, తమకు ఎదురయ్యే సమస్యలను భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అధి కారులు తెలిపారు.

## తాటిమాకులపల్లిలో టీడీపీ ఇంటింటి ప్రచారం

**వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్‌ప్రెస్,ఆగస్టు13:**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు, ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం. థామస్ సూచనల మేరకు వెదురుకుప్పం మండల అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్ ఆధ్వర్యంలో నల్లవెంగనపల్లి పంచాయతీ తాటిమాకులపల్లి గ్రామంలో టీడీపీ ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జీడీ నెల్లూరు నియోజకవర్గం టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు, బూత్ కన్వీనర్ గాలి బాబునాయుడు, పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దొడ్డాల బాబునాయుడు, మహిళా నాయకురాలు భానుమతి, జిల్లా క్రిస్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శి రజినీకాంత్, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ విక్రమ్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు గాలి రమేష్‌నాయుడు, యువ నాయకుడు సురేష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజల అర్జీలకు ప్రాధాన్యం.. సమస్యల పరిష్కారమే లక్ష్యం

### పిఎంకె ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు13:**
ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి సత్వర పరిష్కారం చూపించేందుకు కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం 'జననాయకుడు గ్రీవెన్స్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో పీకేఎం-యూడీఏ చైర్మన్ డాక్టర్ బి.ఆర్. సురేష్‌బాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, స్థానిక అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని పరిశీలించిన డాక్టర్ సురేష్‌బాబు సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి వారి సమస్యలను సత్వరం పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జననాయకుడు గ్రీవెన్స్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు తమ సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కలుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వినతుల రూపంలో సమర్పించారు.

## వెయ్యి హెల్మెట్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం



**ఎస్ఆర్‌పురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు13:**
రోడ్డు ప్రమాదాల నివారణ, ద్విచక్ర వాహనదారుల భద్రతే లక్ష్యంగా శుక్రవారం నిర్వహించనున్న 1,000 హెల్మెట్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పారిశ్రామికవేత్త, సమాజ సేవకుడు మాదిరాజు గణేష్‌రాజు కోరారు. కార్వేటినగరం మండలం అన్నూరు పంచాయతీ పరిధిలోని అమ్మపల్లి క్రాస్ వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని ఎస్ఆర్‌పురం, పాలసముద్రం, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లోని యువకులు, రైతులు, అధికారులు తదితరులకు హెల్మెట్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం. థామస్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు గణేష్‌రాజు తెలిపారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్న ఘటనలు, పలువురు క్షతగాత్రులుగా మిగులుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సేవా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వివరించారు. పోలీసు అధికారులు, యువత, రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు, మాజీ సర్పంచ్ ఆదం సుందర్‌రాజన్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### కడ పిడి వికాస్ మర్మత్ ఐఏఎస్



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు13:**
కుప్పం ప్రాంతంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పలు అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. గుడిపల్లి రోడ్డులో వన్నియాకుల క్షత్రియ భవనం నుంచి డీకే పల్లి జంక్షన్ వరకు నిర్మిస్తున్న కనెక్టింగ్ రింగ్ రోడ్డు పనులను పరిశీలించిన ఆయన, పనులను వేగవంతం చేసి డిసెంబర్ రెండో వారంలోగా పూర్తి చేయాలని గడువు విధించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. డీకే పల్లి రైల్వే అండర్‌పాస్ వద్ద వర్షపు నీరు నిలిచిపోతున్న సమస్యను పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తక్షణమే మోటార్ ఏర్పాటు చేసి నిలిచిన నీటిని తొలగించాలని సూచించారు. అనంతరం కొత్తపేట పీహెచ్‌సీని సందర్శించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఆసుపత్రి చుట్టూ ప్రహరీ గోడ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చివరగా నిర్మాణంలో ఉన్న కుప్పం సెంట్రల్ పార్క్ పనులను పరిశీలించి నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వికాస్ మర్మత్ మాట్లాడుతూ కుప్పంలో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, ప్రజలకు ఉపయోగపడే విధంగా నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయడమే కడ లక్ష్యమన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపాలని అధికారులకు సూచించారు.

## ద్రావిడ విశ్వవిద్యాలయంలో ముగిసిన క్రికెట్ లీగ్





**గుడిపల్లి,చిత్తూరు ఎక్స్‌ప్రెస్,ఆగస్టు13:**
చిత్తూరుజిల్లా కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఈ నెల 3న ప్రారంభమైన ద్రావిడియన్ క్రికెట్ లీగ్-- 2026 గురువారం ముగిసింది. పదిజట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పోటీపడ్డారు.టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య లక్కినేని చిన్నమల్లయ్య చిత్తూరు ఎక్స్ ప్రెస్): బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మనోధైర్యం, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో క్రీడలు, పోటీలు ఎంతో ఉపయోగపడ తాయని అన్నారు.ప్రతిఏడాది క్రికెట్ లీగ్ పోటీల ను నిర్వహిస్తామని తెలిపారు. ఇటువంటి పోటీల ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో అంతర్ విశ్వవిద్యాలయ స్థాయి పోటీల్లో రాణించి ద్రావిడ విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్‌కుమార్,ప్రిన్సిపాల్ విజయవర్ధని, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143